
ఈనాడు
పశ్చిమగోదావరి
గురువారం అక్టోబరు 10, 2024 15

ముగ్గురిని మింగిన కాలువ
పందెపు కోళ్లను ఈత కొట్టిస్తుండగా ప్రమాదం
మృతులు తండ్రీ కొడుకులు
16లో

ఆలయ భూముల్లో పాగా

పరాధీనంలో 316.72 ఎకరాలు



ఈనాడు డిజిటల్, భీమవరం, భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పశ్చిమగోదావరి జిల్లాలో ఆలయ భూములకు రక్షణ కరవైంది. పర్యవేక్షణ లేమి, హద్దులు గుర్తించి కంచె వేయకపోవడంతో వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. మరికొన్ని కోర్టు వివాదాల్లో చిక్కుకున్నాయి. ఏళ్ల తరబడి నోటీసులు ఇవ్వడం తప్ప ఆ భూములను స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు పడటం లేదు. దీంతో ఆస్తులు ఉన్నా ఆదాయం లేక కొన్ని ఆలయాల్లో నిత్యం దీప ధూప నైవేద్యాలకూ ఇబ్బందులు తప్పడం లేదు.

మొత్తం ఆలయాలు 990 | **భూములు 9,632,68 ఎకరాలు**

అన్ని ప్రాంతాల్లోనూ.. పెనుగొండ మండలం సిద్ధాంతంలో నందీశ్వర స్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్లు 421/1, 328/4ఎ, 328/4బి1 భూములు 1.39 ఎకరాలు, పెనుమంట్ర మండలం పోలమూరు గ్రామంలో మార్కండేయ స్వామి ఆలయానికి చెందిన 0.12 ఎకరాల భూములను కొందరు ఆక్రమించుకోగా దేవాదాయ శాఖ అధికారులు గుర్తించి ఇటీవల నోటీసులిచ్చారు. పలు మండలాల్లో ప్రధాన ఆలయాలు, సత్రాల భూములు సైతం ఏళ్ల తరబడి ఆక్రమణల చెరలో మగ్గుతున్నాయి.

స్వాధీనం చేసుకుంటాం.. జిల్లాలో ఆలయ భూములకు సంబంధించి ఏపీ ఎండోమెంట్ ట్రైబ్యునల్‌లో 650 కేసులు వేశాం. వీరవాసరం, నరసాపురం, పెంటపాడు, కాజ, తదితర గ్రామాల్లో 16 ఎకరాలు స్వాధీనం చేసుకున్నాం. మిగిలిన వాటిపై కూడా చర్యలు తీసుకుని త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం. **- ఈవీ సుబ్బారావు, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్**

అధికారిక లెక్కల ప్రకారం ఆక్రమిత భూములు (పదెకరాలు పైగా ఉన్నవి)

ఆలయం పేరు (ప్రాంతం)	భూమి
జనార్దనస్వామి (కాళ్ల)	13.50
నరసింహరాజు సత్రం(పాలకొల్లు)	12.00
నాగేశ్వర, మహిషాసురమర్దని (పెనుగొండ)	48.59
చెన్నకేశవ, వీరేశ్వర (చెరుకువాడ)	29.51
ఉమా వాసుకి రవి సోమేశ్వర (జుత్తిగ)	14.35
నాగేశ్వరస్వామి (తణుకు మండలం)	28.34
తాటకేశ్వర, మల్లేశ్వర (ఇరగవరం)	42.70
వీరేశ్వర స్వామి (పెదతాడేపల్లి)	23.16
బాలవేంకటేశ్వర స్వామి(తాళ్లముదునూరుపాడు)	15.09





జగజ్జననీ.. నమోస్తుతే!

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూలనక్షత్రం సందర్భంగా భీమవరం నాచువారి కూడలిలోని కనకదుర్గ ఆలయం వద్ద బుధవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వేదికపై కొలువుదీర్చిన కనకదుర్గమ్మను సరస్వతీదేవి రూపంలో అలంకరించారు.



బండి కనిపిస్తే మాయం

● భారీగా ద్విచక్రవాహన చోరీలు ● ఫిర్యాదుల నమోదులో పోలీసుల తాత్సారం

☛ తాడేపల్లిగూడేనికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి భీమవరంలో తన కార్యాలయం ముందు నెల క్రితం బండి పెట్టి విధులకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి వచ్చి చూస్తే బండి లేదు. చుట్టుపక్కల వారిని అడిగినా ప్రయోజనం లేదు. స్టేషన్‌కు వెళితే ఫిర్యాదు అవసరం లేదు. వివరాలు ఇవ్వండి.. దొరికితే చెబుతాం అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఇప్పటికీ బండి ఆచూకీ లేదు.

☛ ఇటీవల పాలకోడేరులో ఒకే రోజు రెండు ద్విచక్రవాహనాలు చోరీ చేశారు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వేర్వేరు వాహనాల్లో ఆలయానికి వచ్చారు. గుడిలోకి వెళ్లి దర్శనం చేయించుకుని వచ్చే సమయానికి రెండు బళ్లు లేవు. అందులో ఒక బండి కొని ఏడాది కూడా కావటం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

ఈనాడు, డిజిటల్, భీమవరం: మీ ద్విచక్రవాహనాలు నిలిపి వెళుతున్నారా.. అయితే తిరిగి వచ్చాక ఉంటాయో లేదో గ్యారంటీ లేదు అన్నట్లుంది పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా విచ్చల విడిగా చోరీలు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న దొంగతనాలకు పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల సంఖ్యకు పొంతన ఉండటం లేదు. దీంతో సామాన్య ప్రజలు భారీగా నష్టపోతున్నారు.

అంతా పథకం ప్రకారం

పేద మధ్య తరగతి కుటుంబాలకు ద్విచక్రవాహనమే ఆధారం. అది లేనిదే పని జరగదు. పైసా పైసా కూడబెట్టి కొనుక్కుంటే.. కళ్లు మూసి తెరిచేలోగా మాయం చేస్తున్నారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం ఇలా ప్రతి ప్రాంతంలో ముఠాలు ఉన్నాయి. ముగ్గురు కలిసి ఓ బృందంగా ఏర్పడి ఈ దొంగతనాలకు తెగబడుతున్నారు. సీసీ కెమెరాలు, నిఘా తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వాహనాలు నిలిపేవారినే లక్ష్యంగా చేసుకుంటున్నారు.

విడి భాగాలుగా అమ్మేస్తారు.. దొంగలించిన వాహనాల్లో పరికరాలుగా వేరు చేసి అమ్మేస్తున్నారు. ఇటీవల తణుకు ప్రభుత్వాసుపత్రి దగ్గర బండి దొంగతనం జరిగింది. కొన్ని పరికరాలు మార్చి మరో వ్యక్తికి అమ్మేశారు. అతను షెడ్డుకు తీసుకురాగా మెకానిక్ బండిని గుర్తుపట్టి యజమానికి సమాచారం ఇచ్చారు. మరికొందరు ఎల్లలు దాటించి అమ్ముకుంటున్నారు.

అలసత్వం వీడాలి

వాహనదారులు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయటం లేదు. 10 వాహన చోరీలు జరిగితే రెండు మూడు కేసులు కూడా నమోదు కావటం లేదు. రికవరీ అవుతాయనుకున్న వాటినే నమోదు చేసి 90శాతం రికవరీ చూపిస్తున్నారు. దీనిపై ఎస్పీ నయీంఅస్మిని వివరణ కోరగా సాధ్యమైనంత వేగంగా, పట్టుకుంటున్నామని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యేలా చూస్తామని తెలిపారు.

ఏడాది వారీగా నమోదు చేసిన కేసులు /స్వాధీనం చేసుకున్న వాహనాలు

2022	2023	2024 ఇప్పటి వరకు
239/196	265/202	196/59

ఆటు పోట్లు.. రైతుకు పాట్లు..!

ఉప్పు మడులను ముంచెత్తిన నీరు





చినమైనవానిలంక సమీపంలో నల్లిక్రీక్ కాలువపై శిథిలమైన వంతెనపై రాకపోకలు

నరసాపురం పరిధి చినమైనవానిలంకలో నల్లిక్రీక్‌పై వైకాపా పాలనలో నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. ఆక్వా, ఉప్పు రైతులతో పాటు మత్స్యకారులకు వర ప్రదాయినిగా ఉండే ఈ కాలువ ఆక్రమణల చెరలో చిక్కిపోయింది. వర్షం నీటిని సముద్రంలోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించే కాలువపై మొల్లపర్రు నుంచి కేపీపాలెం వరకూ ఎటు చూసినా ఆక్రమణలే కనిపిస్తున్నాయి. కాలువలో పూడిక తీయకపోవడంతో మత్స్యసంపదకు ఆటంకం కలుగుతోంది. సముద్రపు ఆటుపోట్ల సమయంలో అటు ఆక్వా చెరువులు.. ఇటు ఉప్పు మడులు కడలిపాలవుతున్నాయి. గత తెదేపా హయాంలో కాలువ ప్రక్షాళనకు రూ.18 కోట్లు మంజూరైనా పనులు మొదలు పెట్టినా ప్రభుత్వం మారడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. **- ఈనాడు, నరసాపురం**

రొయ్య పిల్లకు వైరస్ కాటు!

☛ ఉభయ జిల్లాల్లో రూ.వందల కోట్ల నష్టం ☛ ప్రతికూల వాతావరణమే కారణం



ఉండి, న్యూస్‌టుడే: వేసవిని తలపించే ఎండలు, ఉక్కపోత.. అంతలోనే కుండపోత వానలు.. ఇలా నిలకడలేని వాతావరణ పరిస్థితులు రొయ్యలు, చేపల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో సాధారణ స్థాయికి పెరిగిన రొయ్యలు సైతం ఒత్తిడికిలోనై చెరువులోనే కళ్లు తేలేస్తున్నాయి. చెరువుల్లో వదిలిన రొయ్య పిల్లలు(సీడ్) వైరస్ బారిన పడి 60 శాతానికి మించి ఇప్పటికే తుడిచిపెట్టుకుపోయాయి.

అనూహ్య పరిణామాలు.. ఉభయ జిల్లాల్లో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. జులై నుంచి మొదలైన అధిక వర్షాలు, వరదలు, ముంపు సమస్యతో చెరువుల్లో నీటి ఉష్ణోగ్రతల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనికి కలుషిత జలాల సమస్య తోడవడంతో రొయ్యల చెరువుల్లో తెల్లమచ్చల వ్యాధి(వైట్ స్పాట్) విజృంభించింది. కొత్తగా వేసిన సీడ్ కూడా వైరస్ ప్రభావంతో చనిపోతోందని నిపుణులు నిర్ధారిస్తున్నారు. సీడ్ కొనుగోలు, రవాణా, మేత, విద్యుత్తు, నెల రోజుల పాటు యాజమాన్య ఖర్చులు లెక్కిస్తే ఎకరానికి సగటున రూ.1.50 లక్షల చొప్పున రైతులు పెట్టుబడి నష్టపోయారని చెబుతున్నారు. 60 శాతం చెరువుల్లో జరిగిన నష్టం రూ.750 కోట్లకు మించి ఉంటుందని అంచనా.

వర్షాలు తగ్గే వరకు ఆగండి.. వర్షాలు కురుస్తున్నప్పుడు చెరువుల్లో మేత వినియోగాన్ని బాగా తగ్గించాలి. అవసరమైన నీటి పరీక్షలు చేయించి నిపుణుల సూచనల ప్రకారం యాజమాన్య చర్యలు తీసుకోవాలి. పీహెచ్ హెచ్చుతగ్గులను అరికట్టేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎకరానికి ఒక ట్రెండు బస్తాల చొప్పున వ్యవసాయ సున్నాన్ని చల్లాలి. వర్షాలు తగ్గిన తర్వాత కొత్తగా సాగు చేపడితే శీతాకాలంలో లాభదాయక ఉత్పత్తులు సాధించే అవకాశాలున్నాయి.

- ఎన్.వీరభద్రరావు, మత్స్య శాస్త్రవేత్త

కిలో టమాటా రూ.50కే

నేటి నుంచి విక్రయాలు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో భీమవరం, పాలకొల్లు, నరసాపురంలలోని రైతుబజారుల్లో, ఏడు నియోజకవర్గ కేంద్రాల్లో గురువారం నుంచి అందుబాటు ధరలకే ఉల్లిపాయలు, టమాటాలు, వంట నూనెలను విక్రయించనున్నట్లు డీఎస్‌వో సరోజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టమాటా కిలో రూ.50, బియ్యం (కర్నూలు) రూ.32, మహారాష్ట్ర రకం రూ.47, పామాయిల్ (850 గ్రాముల ప్యాకెట్) రూ.119, సన్‌ఫ్లవర్ (910 గ్రాముల ప్యాకెట్) రూ.127 చొప్పున లభిస్తాయని తెలిపారు. పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు.

రోడ్లు ఇలా.. వంతెనలు అలా!



భీమవరం నుంచి మొగల్తూరు వెళ్లే మార్గంలో రహదారులు గోతులమయమయ్యాయి. వంతెనల రక్షణగోడలు శిథిలమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ దారుల్లో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే మార్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

1) తాడేరు-బేతపూడి మధ్య వంతెన రక్షణగోడ శిథిలమైంది.



ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదమే. 2) వెంపరోడ్డు రాళ్లు తేలింది. మొగల్తూరు మండలం వారతిప్ప నుంచి బీచ్‌కు వెళ్లే రోడ్డులో అధ్వానంగా మారింది. ముత్యాలపల్లి సమీపంలోని గొంతేరు డ్రెయిన్‌పైనున్న వంతెన మధ్య రబ్బర్లు ఊడిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. **- ఈనాడు, భీమవరం**



ఆకివీడు: అంతర్గత మార్గంలో జనం అవస్థలు

కుండపోతగా కురిసింది

ఆకివీడు, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం, ఆకివీడు పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం కురిసింది. ఆకివీడులో జాతీయ రహదారితో పాటు అనేక అంతర్గత రహదారులు జలమయమై కాలువలను తలపించాయి. భీమవరంలో పలు రహదారులపై మోకాలిలోతున నీరు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొన్నారు.

ఎన్డీయే అభ్యర్థిని గెలిపించండి: మంత్రి



మాట్లాడుతున్న రామానాయుడు. చిత్రంలో విక్రమ్ కిశోర్, రామరాజు, వీరాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, గోవిందరావు, చిరంజీవి, పద్మశ్రీ, మురళి, రోషన్ కుమార్, ధర్మరాజు తదితరులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిని గెలిపించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. స్థానిక ఓ హోటల్‌లో ఎన్డీయే ప్రజాప్రతినిధులు, నాయకులతో బుధవారం మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు గడువు నవంబరు 6తో ముగియనుందన్నారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు స్పందించి పట్టభద్రులంతా నమోదయ్యేలా చూడాలన్నారు. ఎన్డీయే అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేశారని పాత్రికేయులు అడగ్గా... దీనిపై అగ్ర నేతలు నిర్ణయం తీసుకుంటారని మంత్రి సమాధానమిచ్చారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి.రాజశేఖర్‌ను ఎన్డీయే అభ్యర్థిగా బలపరిచే అవకాశం ఉందన్నారు.

బురద చల్లడమే జగన్ పని.. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటే నాటికే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని మంత్రి నిమ్మల తెలిపారు. దీన్ని సహించలేక జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అయిదేళ్లలో రాష్ట్రాన్ని అథోగతి పాల్జేయడమే కాకుండా రూ.లక్షల కోట్లు అప్పు మిగిల్చారని దుయ్యబట్టారు. సమావేశంలో ఎమ్మెల్యేలు బడేటి చంటి(ఏలూరు), పత్సమట్ల ధర్మరాజు(ఉంగుటూరు), సొంగా రోషన్‌కుమార్(చింతలపూడి), బొలిశెట్టి శ్రీనివాస్(తాడేపల్లిగూడెం), జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, తెదేపా ఏలూరు, పశ్చిమ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, రామరాజు, భాజపా జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిశోర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, తెదేపా నేత రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన ఏలూరు నియోజకవర్గ బాధ్యుడు రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు పోటాపోటీ

ఒక్కోదానికి సగటున 18 దరఖాస్తులు

భీమవరం పట్టణం, అర్బన్, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు భీమవరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమరేశ్వరన్ చెప్పారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 6 ఆబ్కారీ స్టేషన్ల పరిధిలో మొత్తం 175 దుకాణాలకు బుధవారం నాటికి 3,200కుపైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతి దుకాణానికి సగటున 18కిపైగా దరఖాస్తులు వచ్చాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు తదితర పట్టణాల్లో అధికంగా దరఖాస్తులు అందాయి. గడువు పెంపుతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఒకేసారి 40 నుంచి 50 దరఖాస్తులు అందుతుండటంతో ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

❑ మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులను 12, 13 తేదీల్లో పరిశీలించి 14న లాటరీ తీస్తారని కలెక్టర్ నాగరాణి తెలిపారు. అదే రోజు కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందన్నారు. నూతన మద్యం విధానం ప్రకారం 16వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాల్లో విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. లాటరీ నిర్వహణ నిబంధనల మేరకు పూర్తి పారదర్శకంగా జరగాలని ఎక్సైజ్ అధికారులను ఆమె ఆదేశించారు.

ఇప్పట్లో ఎత్తలేనంత చెత్త!

పట్టణాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు

రీసైక్లింగ్‌కు రెండేళ్లు పట్టే అవకాశం

పట్టణాల వారీగా వివరాలు ఇలా..

పట్టణం	రోజూ సేకరించే చెత్త(టన్నుల్లో)	పారిశుద్ధ్య కార్మికులు	ఏటా అయ్యే ఖర్చు (రూ.కోట్లలో)
పాలకొల్లు	40	140	06
నరసాపురం	24	124	6.4
భీమవరం	75	374	7.6
తాడేపల్లిగూడెం	70	220	6.5
తణుకు	45	150	08
ఆకివీడు	18	47	1.70



పాలకొల్లు డంపింగ్‌యార్డు

పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఏ పట్టణంలో చూసినా చెత్త కొండలా పెరిగిపోయింది. ఈరోజు మొదలుపెట్టినా శుభ్రం చేయాలంటే రెండేళ్లు పడుతుందని ఉన్నతాధికారులు, మంత్రులు చెబుతున్నారు. సుమారు వెయ్యికోట్లు ఖర్చవుతుందంటున్నారు. ఎంత వ్యయమైనా ఏడాదిలో పూర్తిగా తొలగించాలని పురపాలక మంత్రి నారాయణకు ఆదేశాలు జారీ చేశా.- ఈనెల 2న మచిలీపట్నంలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాటలివి.

మన జిల్లాలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలంటే ఇంతకంటే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని అధికారులే వాపోతున్నారు.

● గత వైకాపా ప్రభుత్వం అయిదేళ్లలో చెత్త పన్ను విధించడం తప్ప పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు తీసుకున్న చర్యలు శూన్యం. 2014-19 మధ్య ఉమ్మడి జిల్లాలో ప్రతిపాదించిన డంపింగ్‌యార్డుల్లో ఒక్కటి కూడా పూర్తిచేయలేదు. స్వచ్ఛ ఆంధ్రా పేరిట చెత్త బుట్టలు సైతం పూర్తిస్థాయిలో అందజేసి తడిచెత్త, పొడిచెత్త సేకరించలేకపోయారు. ఫలితంగా ఎక్కడ చూసినా ఎత్తలేనంత చెత్త పేరుకుపోయి వీధులేకాదు పట్టణాల మీదుగా వెళ్తున్న మంచినీటి కాలువలు సైతం చెత్తతో నిండిపోయి మురుగు కూపాల్లా మారిపోయాయి.

● ఒక్క నరసాపురం మినహా జిల్లాలో ఇతర పట్టణాల్లో ట్రీట్మెంట్ ప్లాంట్‌లు లేవు.

● జిల్లాలో ఏ పురపాలికను తీసుకున్నా సరాసరిన ఏడాదికి రూ.6కోట్లు పైబడి పారిశుద్ధ్య నిర్వహణకు వెచ్చిస్తున్నారు. దానికి తగిన ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయా అంటే కనీస శుభ్రతకు నోచుకోవడం లేదు.

నరసాపురం, తణుకు, పాలకొల్లు పురపాలికల్లో కార్మికుల సంఖ్య 150కు దాటలేదు. ఆయా పట్టణాల్లో కనీసం 250 వరకు కార్మికులు అవసరమని అధికారులు చెబుతున్నారు.

చర్యలు మొదలు.. ప్రస్తుత ప్రభుత్వం పట్టణాల్లోని చెత్తను తొలగించడంతోపాటు సంపద సృష్టించాలనే ఆలోచనలో ఉంది. దానికి తగిన ప్రతిపాదనలు, స్థల సేకరణలు జరుగుతున్నాయి. ట్రీట్మెంట్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతుంది. **- నరసింహారావు, పురపాలిక ఆర్డీ, రాజమహేంద్రవరం.**

100 రోజులు దాటినా .. ఇంతే..!



వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం పేరిట బోర్డు

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు దాటినా నేటికీ గ్రామాల్లో పాత ప్రభుత్వ ఛాయలే కనిపిస్తున్నాయి. అనేక పథకాల పేర్లు మార్చి అమలు చేస్తున్నా ఇప్పటికీ వైకాపా పథకాల బోర్డులే దర్శనమిస్తున్నాయి. నెలమూరు గ్రామంలో వైద్యశాఖకు చెందిన వెల్‌నెస్ భవనం వద్ద గత సీఎం జగన్ చిత్రంతో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్యం సమాచారంతో కూడిన బోర్డు ఇప్పటికీ అలాగే వదిలేశారు. పాత పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం వద్ద వైఎస్ఆర్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం బోర్డును సైతం కొనసాగిస్తున్నారు. నిత్యం ఇక్కడకు గ్రామ ప్రజలు వైద్య సేవలు కోసం వస్తుంటారు. ఇలాంటి పరిస్థితిలో ఈ బోర్డును చూసి కొందరు ముక్కున వేలేసుకుంటున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.



నెలమూరులో వెల్‌నెస్ సెంటర్ వద్ద పాత ప్రభుత్వం బోర్డు

- న్యూస్‌టుడే, పెనుమంట్ర

ఎన్నాళ్లు.. ఈ కన్నీళ్లు!

పాలకొల్లు, న్యూస్‌టుడే



నిరాదరణతో కుంగిపోతున్న తల్లిదండ్రులు

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

- జంగారెడ్డిగూడెంకు చెందిన వృద్ధ దంపతులు ఆరుగురు సంతానాన్ని పెంచి పోషించారు. వయసు మీదపడి ఇప్పుడు వారికి ఓపిక తగ్గిన తరుణంలో ఒక్కరూ వారిని చూసుకునే బాధ్యత తీసుకోలేకపోయారు. రెక్కలొచ్చిన పక్షుల్లా జీవితంలో స్థిరపడిన వారసులు బయటకు వెళ్లిపోవడంతో పూర్వ ఇళ్లలోనే చాలామంది వృద్ధులు ఆఖరి రోజులను భారంగా వెళ్లదీస్తున్నారు.
- వయోభారంతో ఉన్న తన పోషణను కుమారుడు పట్టించుకోవడం లేదని భీమవరం మండలం రాయలంకు చెందిన ఆంజనేయులు సెప్టెంబర్ 24న భీమవరంలో కలెక్టర్‌కు అర్జీ అందించారు.

బాల్యంలో మనల్ని బాధ్యతగా చూసిన తండ్రిని వృద్ధాప్యంలో చూసుకోవలసిన బాధ్యత మనపై ఉందనే మానసిక పరిపక్వత నేటితరంలోని కొందరికి కరువవ్వడంతోనే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి.

- ప్రస్తుతం తల్లిదండ్రులను చూసుకునేందుకు కొందరు తనయులు వంతులవారీ విధానం అమలు చేస్తున్నారు. భీమవరం పట్టణంలోని గునుపూడికి చెందిన సూర్యావతి వాపోతున్నారు. ఇద్దరు కుమారుల్లో ఒకరికి వంతు వచ్చినపుడు తన పోషణ చూడటం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంకొందరైతే తల్లిని ఒకరు తండ్రిని మరొకరు చూసే కార్యక్రమాలకు ఒడిగడుతున్నారంటే ఆశ్చర్యం కాదు.

పెద్దవయసులో చిన్నతనం.. ఇలాంటివన్నీ వృద్ధుల్లో మానసిక సమస్యలకు మూలం అవుతున్నాయి. విశ్రాంత వయసు వచ్చాక పిల్లల నుంచి పోషణ సరిగా లేకపోవడంతో చాలామంది కుంగుబాటుకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని ఎవరికైనా చెప్పుకున్నా చిన్నతనంగా ఉంటుందని భావించి కొందరు తల్లిదండ్రులు నోరు మెదపక వారిలో వారే మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. భార్యాభర్తలుంటే వృద్ధాప్యంలో ఎదురయ్యే కష్టాలను ఒకరికొకరు పంచుకుని కొంత స్థైర్యంగా ఉంటున్నారు. పోషణలో నిరాదరణకు గురవుతున్న భార్యాభర్తల్లో ఏ ఒక్కరూ చనిపోయినా మిగిలిన ఒక్కరి వేదన వర్ణనాతీతం. పిల్లలకు దూరంగా ఉండలేక ఒంటరితనం భరించలేక వృద్ధాప్యంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నవారు లేకపోలేదు.

సానుకూలతతోనే.. ఒంటరితనం, నిరాదరణ వంటి కారణాలు వృద్ధుల్లో మానసిక సమస్యలకు దారితీస్తున్నాయి. దీనికి శారీరక సమస్యలు కూడా తోడవడంతో మరింత కుంగుబాటుకు గురవుతున్నారు. మనం మన తల్లిదండ్రులను ఎలా చూస్తామో భవిష్యత్తులో మన పిల్లలు కూడా దాదాపు అలాగే ప్రవర్తిస్తారనే విషయాన్ని అందరూ గ్రహించాలి. వృద్ధుల మంచి చెడులు చూసుకోవడం తమ బాధ్యతగా పిల్లలు గుర్తిస్తే వారిని ఆనందంగా, ఆరోగ్యం ఉంచొచ్చు. **- అక్కింశెట్టి రాంబాబు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, తణుకు.**

అంబేడ్కర్‌పై అమిత గౌరవం

కాళ్ల, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే తనకు అమిత గౌరవమని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. కాళ్లకూరులో పలు నూతన భవనాలను బుధవారం ప్రారంభించిన ఆయన గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఏలూరుపాడులో ఆలయానికి అడ్డుగా ఉన్న చిన్న షెడ్డును మార్చాలని తెలిపి పక్కకు పెట్టిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఆలయాలు, చర్చిలు, మసీదులకు ఎవరైనా అడ్డుగా షెడ్లు కడితే తాను ఇదేవిధంగా స్పందిస్తానని స్పష్టం చేశారు. దీనిపై కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఏమనుకున్నా నియోజకవర్గ ప్రజలంతా కులమతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలనేదే తన ఉద్దేశమన్నారు.



విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు

ఉపకార వేతనాలకు దరఖాస్తులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో బీసీ, ఈబీసీ, సంచార జాతుల కులాల విద్యార్థుల నుంచి ప్రధానమంత్రి యశస్వి యోజన ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సంక్షేమ, సాధికారిత అధికారి జి.గణపతిరావు తెలిపారు. తొమ్మిది, పది తరగతుల విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు, ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్టోబరు 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 2.50 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు భీమవరం కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ అధికారులను సంప్రదించవచ్చు.

ఉండిలో 42.2 మి.మీ.వర్షం

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు 14.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఉండి మండలంలో 42.2 మి.మీ. వర్షం కురిసింది. మండలాల వారీగా ఇరగవరం 38.2, భీమవరం 28.8, గణపవరం 25.2, పాలకొల్లు 21.4, కాళ్ల 20.2, పాలకోడేరు 15.4, వీరవాసరం 15.2, తాడేపల్లిగూడెం 13.6, పెంటపాడు 12.2, మొగల్తూరు 10.4, యలమంచిలి 10.2 మి.మి. వర్షపాతం నమోదైంది.

క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలి

టెన్నిస్ పోటీల ముగింపులో ఆర్డీవో

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: క్రీడలపై విద్యార్థులు ఆసక్తి కలిగి ఉండాలని ఆర్డీవో దాసి రాజు అన్నారు. పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, టౌన్‌హాల్ సంయుక్త ఆధ్వర్యంలో రుద్రరాజు పద్మరాజు మెమోరియల్ రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు బుధవారం సాయంత్రం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం ఆర్డీవో దాసి రాజు హాజరై మాట్లాడారు. పట్టణ సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారంతా క్రీడాస్ఫూర్తి కలిగిన వారే అన్నారు. టౌన్‌హాల్‌లో బాలికల విభాగానికి పోటీలు నిర్వహించగా కాస్మోక్లబ్‌లో బాలుర విభాగానికి పోటీలు జరిగాయి. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. టోర్నమెంట్ కమిటీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీనివాసరాజు, కృష్ణవర్మ, చేకూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే: అండర్-10 బాలికల విభాగంలో విన్నర్‌గా పి.అతర్వ (గుంటూరు), రన్నర్‌గా పి.వి.సూక్షిత్ (పల్నాడు), అండర్-12 విభాగంలో విన్నర్ ఎస్.లేఖశ్రీ (పాలకొల్లు), రన్నర్ పి.అథర్వ (గుంటూరు), అండర్-14 విభాగంలో విన్నర్ ఎ.శ్రీవైశాలి (విజయవాడ), రన్నర్ ఎస్.లేఖశ్రీ (పాలకొల్లు) నిలిచారు. అండర్-10 బాలుర విభాగంలో విన్నర్‌గా టి.ఎక్షిత్‌చౌదరి (విశాఖపట్నం), రన్నర్‌గా సీహెచ్.విహార్ (గుంటూరు), అండర్-12 విభాగంలో విన్నర్‌గా భువన్‌ధీరజ్ (పాలకొల్లు), రన్నర్‌గా ఎ.వీరేన్ (విశాఖపట్నం), అండర్ -14 విభాగంలో విన్నర్‌గా ఎ.దుర్గాసాయి అఖిల్ (పాలకొల్లు), రన్నర్ ఎం.డి.ఖుషీద్ (ప్రకాశం) నిలిచారు.



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఆర్డీవో దాసి రాజు, సీఐ రజనీకుమార్

చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు : ఎస్పీ

నరసాపురం, న్యూస్‌టుడే: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి హెచ్చరించారు. నరసాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించి, దస్త్రాలను పరిశీలించారు. సీఐ, ఎస్సై కార్యాలయాలు, కంప్యూటర్ గది, సీసీ కెమెరాల పనితీరు చూశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రేడ్ పోలీస్ విధానం అమలు చేయాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ బ్లాక్‌స్పాట్లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు, సీటు బెల్టు, శిరస్త్రాణధారణపై వాహనదారులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై యువత, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. పండుగల పేరుతో కోడి పందేలు, గుండాట, జూదాలకు పాల్పడినా, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవన్నారు. సైబర్ నేరాల పెరుగుతున్న ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటి నిరోధానికి పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

ముగ్గురిని మింగిన కాలువ

- పందెం కోళ్లను ఈత కొట్టిస్తుండగా ప్రమాదం
- మృతులు తండ్రీకొడుకులు
- పెదవేగి మండలం కవ్వగుంటలో విషాదం

పెదవేగి, న్యూస్‌టుడే : పెదవేగి మండలం కవ్వగుంటలో విషాదం అలుముకుంది. ప్రమాదవశాత్తూ పోలవరం కుడికాలువలో పడి ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, ఇద్దరు కుమారులు మరణించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శెట్టిపల్లి వెంకటేశ్వరరావు కూలీ పనులతోపాటు పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతనికి భార్య దేవి, మణికంఠ, సాయికుమార్ ఇద్దరు కుమారులున్నారు. కుమారులు పెదవేగిలోని ఒక పాఠశాలలో 9, 7వ తరగతులు చదువుతున్నారు. వీరు తాము పెంచుకుంటున్న పందెపు కోళ్లను బుధవారం కుడికాలువలోకి ఈత నేర్పేందుకు తీసుకువెళ్లారు. చిన్న కుమారుడు శెట్టిపల్లి సాయికుమార్(13) కోడి పుంజును తీసుకొని నీళ్లలో వదిలే క్రమంలో జారి కాలువలో పడిపోయాడు. ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో ఒక్కసారిగా మునిగిపోయాడు. గట్టుపై ఉన్న అన్న మణికంఠ(14) తమ్ముడిని రక్షించే క్రమంలో మునిగిపోయాడు. కాలువ గట్టు సమీపంలోనే ఉన్న తండ్రి వెంకటేశ్వరరావు(50) ఇది చూసి అక్కడికి చేరుకున్నారు. కుమారులను రక్షించేందుకు కాలువలో దిగినా ఉద్ధృతికి అతనూ మునిగిపోయాడు.



భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య దేవి

కొడుకులు ఇంటికి రాలేదని.. కాలువ దగ్గరకు వెళ్లిన కుమారులు ఇంటికి రాకపోవటంతో తల్లి దేవి వారిని వెతుక్కుంటూ వెళ్లారు. కాలువలో వెంకటేశ్వరరావు చెయ్యి కన్పించడంతో స్థానికులు కాలువలోకి దిగి మృతదేహాన్ని వెలికి తీశారు. అదే ప్రాంతంలో గాలించగా పెద్దకుమారుడు మణికంఠ మృతదేహం దొరికింది. చిన్నకుమారుడు ఆచూకీ లభించలేదు. అగ్నిమాపకశాఖ సిబ్బంది అక్కడకు చేరుకొని గాలించారు. బురదలో కూరుకుపోయిన చిన్నకుమారుడు సాయికుమార్ మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. భర్త, కంటి పాపల్లాంటి కుమారులు మృతి చెందడంతో తల్లి గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరయ్యారు. వారి మృతదేహాలపై పడి విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. మరణాలను ఆత్మహత్యలు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పెదవేగి ఎస్సై వి. రాజేంద్రప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

పోడూరు, న్యూస్‌టుడే: త్వరలో చేపట్టే ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సర్వం సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏవో) జెడ్.వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. ధాన్యం కొనుగోలు మూడో దశపై బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గతంలో గుర్తించిన లోటుపాట్లు అధిగమించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. హమాలీలు, రవాణా వాహనాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఏడీఏ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సరకు లేదంటూ.. సర్దేస్తూ!

నల్ల బజారులో సర్కారీ మద్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ దుకాణాల్లో మద్యం సరిపడా లేదు. రూ.130, రూ.150, రూ.180కు లభించే సరకు అందుబాటులో లేదు. అధికశాతం దుకాణాల్లో రూ.250కు లభ్యమయ్యే మద్యం సీసాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. కొత్త దుకాణాలు ఏర్పాటయ్యే వరకు అదనపు భారం తప్పదేమోనని మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు.

సీసాలు మార్చి.. ఏమార్చి.. రూ.130- రూ.180 మధ్య ధర ఉంటే మద్యం ప్రభుత్వ దుకాణాల్లో దొరక్కపోయినా గ్రామాలు, వార్డుల్లో ప్రైవేటు వ్యాపారుల వద్ద లభ్యమవుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి మద్యాన్ని కూడా ఎక్కువ ధర ఉండే సీసాల్లో పోసి, నీళ్లతో కల్తీచేసి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. చాలా దుకాణాల్లో సరకు సరిపడా ఉండటం లేదని.. ఎందుకు లేదని అడిగితే.. గతంలో ఉన్న సరకు ఇక రాదని, పాత నిల్వలు అయిపోవడంతో కొన్ని రకాలు అందుబాటులో లేవంటూ సిబ్బంది మాట దాటవేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. ఈ అంశాన్ని మద్యం డిపో మేనేజరు రంగారెడ్డి దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా ఈ నెల ఆరంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా.. ప్రస్తుతం అన్ని రకాలు అందుబాటులో ఉంచామన్నారు. పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

ఇంటి ఆవరణలో మృత శిశువు

కాళ్ల (భీమవరం పట్టణం), న్యూస్‌టుడే: కాళ్ల మండలం ప్రాతళ్లమెరక గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో మృత శిశువును గుర్తించినట్లు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు బుధవారం చెప్పారు. మృత శిశువును సమీప కాలువలోకి విసిరేస్తే కుక్కలు ఈడ్చుకొచ్చాయా.. లేక ఇతర ప్రాంతం నుంచి ఇక్కడికి తీసుకొచ్చి వదిలేశారా అనే కోణాల్లో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. దీనిపై స్థానికుల సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రూ.6 లక్షల సొత్తు అపహరణ

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. పట్టణంలోని థామస్ బ్రిడ్జి ప్రాంతానికి చెందిన ఆర్‌సీ ఆనందకుమార్ కృష్ణా జిల్లా పరిషత్తు డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వహిస్తూ మచిలీపట్నంలో నివాసం ఉంటున్నారు. థామస్‌బ్రిడ్జి ప్రాంతంలోని సొంతింటికి తాళం వేశారు. ఆ ప్రాంతానికి చెందిన మహిళ ప్రతి రోజు ఇంటి ఆవరణ శుభ్రం చేసి వెళ్తారు. మంగళవారం ఇంటికి వేసిన తాళం అలాగే ఉంది. ఆనందకుమార్ బుధవారం ఉదయం బంధువుల ఇంట్లో శుభకార్యానికి పట్టణానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఇంటికి వచ్చారు. ఇంటికి వేసిన తాళం పగులకొట్టి ఉండటాన్ని ఆయన గుర్తించారు. బీరువాల్లో భద్రపరచిన సుమారు రూ.లక్షలు పైబడి విలువగల వెండి, నాలుగు కాసుల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరించుకుపోయారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ బి.యాదగిరి ఘటనా ప్రాంతాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. భీమవరం నుంచి క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

బాలికపై 5 నెలలుగా అత్యాచారం

- ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయని ఎస్సై
- బాధితులతో కలిసి ఐజీ దృష్టికి తెచ్చిన ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అభం శుభం తెలియని ఓ బాలికపై నిందితుడు అయిదు నెలలుగా అత్యాచారం చేసి గర్భిణిని చేశాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఎస్సై పట్టించుకోలేదు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి కుటుంబ సభ్యులతో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. దెందులూరు మండలానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి ద్వారకాతిరుమల మండలం మల్లసానికుంటకు చెందిన యువకుడు లోబర్చుకున్నాడని, ప్రస్తుతం బాలిక 5 నెలల గర్భిణి అని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి తల్లిదండ్రులు దెందులూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి నెల రోజులు గడుస్తున్నా, నేటికీ కేసు నమోదు చేయలేదని చింతమనేని అసంతృప్తి వ్యక్తం చేశారు.

భీమవరం
•భీమవరం •ఉండి


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పట్టణ సుందరీకరణకు ప్రణాళిక

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలని సంయుక్త కలెక్టర్, పట్టణ ప్రత్యేకాధికారి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టణంలో సమస్యలు, సదుపాయాలపై ఆరా తీశారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ తరగతులను భీమవరం మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్, తహసీల్దార్ రాంబాబు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల నుంచి ధాన్యం మిల్లుకు చేరే వరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని మహిళా సమాఖ్య భవనంలో ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: రెండో పట్టణ పరిధిలో చెత్తను రెండు, మూడురోజులకోసారి తరలిస్తున్నారు. డ్రెయిన్లలో సిల్టు కూడా తీయడంలేదు. దుర్వాసన భరించలేకపోతున్నాం. **- స్థానికులు**

సమాధానం: చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. డ్రెయిన్లను కూడా శుభ్రం చేయించేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచిస్తాం. **- సీహెచ్ వెంకటేశ్వరరావు, సహాయ కమిషనర్**


స్థానికులతో మాట్లాడుతున్న భాజపా నాయకులు

కేంద్ర పథకాలతో పేదలకు లబ్ధి

వీరవాసరం, న్యూస్‌టుడే: పేదలకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని భాజపా మండల అధ్యక్షుడు కోడి నరసింహం అన్నారు. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వీరవాసరం ఎస్సీ కాలనీలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాలు, ఉపాధి హామీ తదితర పథకాల ద్వారా నిధుల కేటాయింపు తీరును ప్రజలకు వివరించారు. నాయకులు కురెళ్ల నరసింహారావు, కొప్పిశెట్టి వెంకటరెడ్డి, వేంద్ర దివాకర్, దగ్గు రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపీమూర్తి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

వీరవాసరం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. వీరవాసరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురయ్యారని.. అలాంటివి పునరావృతం కాకుండా హక్కుల సాధనకు సమష్టి కృషి అవసరమన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు యాజమాన్యాల దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనమండలిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల గళం వినిపిస్తానన్నారు.

అదనపు అంతస్తులు.. అడ్డగోలు నిర్మాణాలు!


జిల్లా కేంద్రం చుట్టూ ఇదే తంతు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించాక చుట్టుపక్కల గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారం మరింత జోరందుకుంది. గత ఐదేళ్లలో కొందరు వైకాపా నాయకులే వ్యాపారులుగా అవతారమెత్తి ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలకు తెగబడ్డారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు సైతం నాటి పాలకులకు మడుగులొత్తి నిబంధనల ఊసే మరిచారని విమర్శలున్నాయి. పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి భవనాల్లో ఫ్లాట్లు కొనుగోలు చేసిన కొందరు బాధితులు ధైర్యం చేసి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తుండటంతో అక్రమ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

అడుగడుగునా ఉల్లంఘనలు

చినఅమిరం, గొల్లలకోడేరు, నర్సింహపురం, రాయలం, కొవ్వాడ, విస్సాకోడేరు తదితర గ్రామాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల భవనాలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో రెండు అంతస్తుల వరకే పంచాయతీల ద్వారా అనుమతి ఇస్తారు. అంతకు మించి అంతస్తులు వేయాలంటే ఉడా అనుమతి తప్పనిసరి. కానీ నిర్మాణదారులు అడ్డగోలుగా అదనపు అంతస్తులు వేసి మొత్తం అనుమతి తీసుకున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. వీటిని నమ్మి సామాన్యులు మోసపోతున్నారు.

భీమవరం మండలం చినఅమిరంలో నిర్మించిన ఈ భవనంలో నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తు వేసి రెండు ఫ్లాట్లు నిర్మించి విక్రయించారు. పొందిన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు ఆరోపిస్తూ కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అదనపు అంతస్తుల విషయంలో గందరగోళ పరిస్థితి నెలకొనడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.





రాయలంలో నిర్మిస్తున్న ఈ భవనానికి అనుమతులు ఉన్నట్లు చెబుతున్నా భద్రతా ప్రమాణాలు పాటించడం ఆరోపణలున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనం భవనం చుట్టూ తిరిగేలా ఖాళీ స్థలం వదలాలి. ఇక్కడ అలాంటి అవకాశమే లేదు. ఈ ప్రాంతంలో ఇలాంటి భవనాలు మరికొన్ని ఉన్నాయి.

చినఅమిరంలోని ఓ భవనంలో 5వ అంతస్తులో ఫ్లాట్‌ను 2022 మార్చిలో కొనుగోలు చేయగా నిర్మాణదారుడు ఇప్పటికీ ఎన్‌వోజీ ఇవ్వలేదని.. దీనిపై కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని గ్రామానికి చెందిన చెల్లబోయిన పట్టాభిరామయ్య చెప్పారు.

విచారణ జరుపుతాం: నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నిర్మాణాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని.. ఈ వ్యవహారాల్లో అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే ఉపేక్షించేది లేదని జిల్లా పంచాయతీ అధికారిణి అరుణశ్రీ తెలిపారు.

పాలకోడేరు ఎస్సైగా రవివర్మ

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు ఎస్సైగా నియమితులైన ఎం.రవివర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. రైటర్ ఎస్.అజరయ్య, పోలీసు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఈవోపీఆర్డీ బాధ్యతల స్వీకరణ

ఉండి, న్యూస్‌టుడే: ఉండి మండల ఈవోపీఆర్డీగా సీహెచ్ వెంకటరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎంపీడీవో ఎస్.రవీంద్రను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు ఈవోపీఆర్డీని కలిసి అభినందనలు తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పాలకోడేరు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీవో వి.రెడ్డియ్య, ఈవోపీఆర్డీ రామప్రసాద్ తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో 10 అంశాలపై ఏవో పూర్ణబాబ్జీ తదితర అధికారులు ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.

తపాలా పథకాలపై అవగాహన

గునుపూడి, న్యూస్‌టుడే: తపాలాశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎన్‌వీ సత్యనారాయణరాజు సూచించారు. ప్రపంచ తపాలా వారోత్సవాలను పురస్కరించుకొని భీమవరంలోని ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 16 వరకు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, స్టాంపుల ప్రదర్శన, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు.

నేడు ఆధార్ శిబిరాలు

వారోత్సవాల్లో భాగంగా డివిజన్ పరిధిలో తాడేరు, దగ్గులూరు, రేలంగి, తేతలి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని తపాలా శాఖ అధికారులు తెలిపారు. నూతన కార్డుల నమోదు, చిరునామా, చరవాణి సంఖ్య మార్పు వంటి సేవలు అందిస్తామని తెలిపారు.

సంక్రాంతిలోపు చెరువుల ప్రక్షాళన

కాళ్ల, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి దాతలు సహకరించడం శుభ పరిణామమని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో ఆరోగ్య కేంద్రం, సచివాలయ భవనాలను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి నియోజకవర్గంలో అన్ని మంచినీటి చెరువులను ప్రక్షాళన చేసి చుట్టూ నడక బాటలు ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. దాతల సహకారంతో ఉండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. సర్పంచి సాధు శ్రీదేవి, ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక శిక్షణ కేంద్రంగా ప్రభుత్వ ఐటీఐ

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలోని ప్రభుత్వ ఐటీఐని ఆధునిక వృత్తి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దాతలు, ఔత్సాహికులు ముందుకురావాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పిలుపునిచ్చారు.


విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఐటీఐ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'దక్షిణ భారత దేశంలోనే ఉండి ప్రభుత్వ ఐటీఐకి మంచి పేరుంది. ఆక్వా రంగంలో వినియోగించే ఏరియేటర్లు, జనరేటర్లు, ఆయిల్ ఇంజిన్ల నిర్వహణ, చరవాణుల మరమ్మతులకు సంబంధించి కోర్సులు ప్రవేశపెడితే విద్యార్థులకు స్థానికంగానే మంచి ఉపాధి లభిస్తుంది. ఉండి ఐటీఐని తలమానికంగా తీర్చిదిద్దేందుకు అంతా కలిసికట్టుగా కృషి చేద్దాం.' అని పేర్కొన్నారు. ఐఎంసీ కార్యదర్శి, ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు, సహాయ డైరెక్టర్ రాజశేఖరబాబు, సభ్యులు మాట్లాడారు. అనంతరం వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 144 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలు అంజేశారు.

సమన్వయంతో పనిచేద్దాం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా నాయకులు, శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి కోరారు. నియోజకవర్గ నాయకులు, శ్రేణులతో పార్టీ కార్యాలయంలో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. వచ్చే ఏడాది జరగనున్న ఉమ్మడి పశ్చిమ-తూర్పు గోదావరిజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలపైనా దృష్టి పెట్టాలని సూచించారు. పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించాలని పేర్కొన్నారు. తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ యిందుకూరి రామలింగరాజు తదితరులు మాట్లాడుతూ సభ్యత్వ నమోదుపై అన్ని స్థాయిల ఇన్‌ఛార్జులు బాధ్యతగా పని చేయాలన్నారు. అనంతరం నాయకులంతా కలిసి సభ్యత్వ నమోదు పత్రాలను ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు యిందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు, భీమవరం, వీరవాసరం మండలాల అధ్యక్ష, కార్యదర్శులు రేవు వెంకన్న, కపురు పృథ్వీశంకర్, కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు పత్రాలు ప్రదర్శిస్తున్న నాయకులు


నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

ఇసుక కొరతతో ఇబ్బందులు

ఉండి, న్యూస్‌టుడే: ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచిపోయి కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ పేర్కొన్నారు. ఉండి ప్రధాన వంతెన కూడలిలో ఆ పార్టీ నాయకులు బుధవారం భవన నిర్మాణ సామగ్రిని ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఇసుక లభ్యతను పెంచి నిర్మాణ రంగంపై ఆధారపడిన కార్మికులకు ఉపాధి చూపాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ రద్దు చేయాలని నిరసన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉచిత ఇసుకపై జీఎస్టీ రద్దు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికుల (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) సంఘం ఆధ్వర్యంలో ఎల్.అగ్రహారంలో బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం మంచిదే అయినా క్షేత్ర స్థాయిలో విఫలమవుతోందన్నారు. అక్రమార్కులు అక్రమ సిండికేట్ బుక్ చేసుకుని మార్కెట్లో కృత్రిమ కొరత తీసుకు వస్తున్నారని ఆరోపించారు. గృహ యజమానులకు మాత్రమే ప్రత్యేకంగా బుక్ చేసుకునే విధానం అమలు చేయాలన్నారు.

వివాహిత అదృశ్యం

ఉండి, న్యూస్‌టుడే: ఉండికి చెందిన వివాహిత వారం కిందట ఎన్నార్పీఅగ్రహారంలో పుట్టింటికి వచ్చారు. బుధవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీనిపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	దేవర
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	సత్యం సుందరం
కిషోర్ స్క్రీన్ 1	మత్తువదలరా 2
కిషోర్ స్క్రీన్ 2	దక్షిణ
నటరాజ్	రామ్‌నగర్ బన్నీ
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	స్వాగ్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	సత్యం సుందరం
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	దేవర
విజయలక్ష్మి స్క్రీన్ 1	స్వాగ్
మహాలక్ష్మి స్క్రీన్ 2	కాళి

చదువుల తల్లీ.. దీవెనలివ్వు


సరస్వతీమాత అలంకరణలో మావుళ్లమ్మ ఉత్సవమూర్తి

భీమవరం ఆధ్యాత్మికం, పాలకోడేరు, కాళ్ల, ఉండి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయం వద్ద విద్యార్థులతో సామూహికంగా సరస్వతీ పూజలు చేయించారు. విద్యార్థులకు వేమన శతకం, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారిని సరస్వతీమాత రూపంలో, అన్నపూర్ణమ్మను 5వేల గాజులతో అలంకరించారు. పాలకోడేరు మండలం మోగల్లు భద్రకాళీ సమేత భీమేశ్వరస్వామి, శృంగవృక్షం శివారు బంటుమిల్లి పెద్దింట్లమ్మ ఆలయంలో సరస్వతీ పూజలు నిర్వహించారు. కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకాలు చేశారు. ఉండి సాలిపేట రామాలయం వద్ద 200 మంది చిన్నారులకు విద్యా సామగ్రి పంపిణీచేశారు.


భీమవరం: సరస్వతీ పూజలో విద్యార్థులు


మోగల్లులో భద్రకాళీమాత

సూర్యకిరణ శోభ



ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పురదేవత పెద్దింట్లమ్మ మూలవిరాట్‌పై బుధవారం ఉదయం సూర్యకిరణాలు ప్రసరించాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఈ దృశ్యాన్ని తిలకించారు. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

పెద్దింట్లమ్మకు 51 కిలోల లడ్డూ ప్రసాదం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు పుర దేవతగా పెద్దింట్లమ్మకు సాయిరాం స్వీట్స్ యజమాని మడపాన నాగబాబు 51 కిలోల లడ్డూ ప్రసాదాన్ని సమర్పించారు. పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, మహాలక్ష్మీపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విద్యార్థులతో సామూహికంగా సరస్వతీ పూజలు చేయించారు.



కనీస వసతులూ కరవే..!

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో వారంతపు సంత ప్రాంగణం కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. ఇక్కడ ప్రతి బుధవారం నిర్వహించే సంత ద్వారా ఆకివీడు నగర పంచాయతీకి ఏటా రూ.3.30 లక్షల ఆదాయం సమకూరుతుంది. పట్టణం మధ్యలో సువిశాల స్థలంలో ఉన్న ఈ సంతలో కనీస వసతులు లేక దుకాణందారులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. ఆకివీడు పట్టణం, సమీప గ్రామాలు, కొల్లేరు తీర ప్రాంత ప్రజలు ప్రతి బుధవారం ఇక్కడకు వచ్చి కూరగాయలు, నిత్యావసర సరకులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు తాత్కాలికంగా బరకాలు కట్టుకుని విక్రయాలు కొనసాగిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు ఈ ప్రాంగణం బురదగా మారి కొనుగోలుదారులు జారిపడుతున్నారు. ఈ సమస్యను కమిషనర్ కృష్ణమోహన్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా సంత ప్రాంగణంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.


బురదమయంగా వారంతపు సంత ప్రాంగణం


ప్రతిష్ఠించిన సరస్వతీ మాత విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

అపూర్వం.. ఆత్మీయం

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: మహదేవపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం సందడి వాతావరణంలో జరిగింది. నాటి విద్యార్థి సంఘ నాయకుడు, ప్రస్తుత ఉపాధ్యాయుడు బి.వీరబాబు, జి.సూర్యకుమారి, ఎన్.రోజీ, టి.నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్, లక్ష్మి, ఎల్.హరిప్రసాద్, గజపతిరాజు తదితరుల సౌజన్యంతో పాఠశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించిన సరస్వతీమాత విగ్రహాన్ని పూర్వవిద్యార్థులు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు ఆవిష్కరించారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు రుద్రరాజు ధర్మరాజు, వేము నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని నిర్ణయించినట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు తెలిపారు.

వానొస్తే ఇంతే..!

కాళ్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కాళ్ల గ్రామంతో పాటు మండల వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. వరుసగా మూడోరోజూ భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాల్లో, రహదారులపై నీరు నిలిచిపోయి వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. అసలే అధ్వానంగా ఉన్న కోలనపల్లి - ఆకివీడు రహదారి అస్తవ్యస్తంగా తయారైంది.


కాళ్ల ప్రధాన రహదారిలో వాహనచోదకుల అవస్థలు

నేటి నుంచి అజ్జాలమ్మ జాతర

అజ్జమూరు (ఆకివీడు), న్యూస్‌టుడే: ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామ దేవత అజ్జాలమ్మ జాతరను గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని నిత్యం ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎటువెళ్దామన్నా.. సాహసయానమే!


భీమవరం శ్రీరామపురం మార్గంలో..

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన భీమవరంలో ప్రయాణమంటే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. వైకాపా పాలనలో పట్టణంలో ప్రధాన రహదారులన్నీ నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. ఎన్నికలకు ముందు ఓటర్లను ఆకర్షించేందుకు కొన్ని రహదారులను కొంతమేర అభివృద్ధి చేశారు. ప్రస్తుత వర్షాలకు అప్పట్లో వేసిన తారుపొర కొట్టుకుపోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. పట్టణంలో జువ్వలపాలెం రోడ్డు- శ్రీరామపురం, పద్మాలయా థియేటర్ మీదుగా మండలంలో గ్రామాల వెళ్లే మార్గాలన్నీ ఛిద్రమైపోవడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. గుంతల్లో వాన నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే గుంతలను పూడ్చిస్తామని.. రహదారులపై నీరు నిలిచిపోకుండా చర్యలు చేపడతామని ఎంఈ పి.త్రినాథరావు చెప్పారు.


బలుసుమూడి రామాలయం వద్ద..

వర్షాలకు ఛిద్రమైన రహదారులు


జేపీ కాలనీ కూడలిలో..

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చు


ఆచంట, పెనుమంట్ర, న్యూస్‌టుడే: రైతులు తమకు నచ్చిన రైస్‌మిల్లుకు ధాన్యం అమ్ముకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై మూడో దశ శిక్షణ కార్యక్రమం ఆచంటలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కొనుగోలు కేంద్రం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. పెనుమంట్ర మండల పరిషత్తు కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఏవో జ్యోషిలా మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

అధ్వాన రహదారితో అవస్థలు



పెనుగొండ గ్రామీణ, పెనుగొండ, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రధాన రహదారులు గోతులు, బురదతో అధ్వానంగా మారాయి. ఈ రహదారులపై ప్రయాణం నరకంలా ఉందని వాహన చోదకులు, గ్రామస్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునమర్రు నుంచి కొతాలపర్రు వెళ్లే రహదారికి భారీగా గోతులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షం వస్తే గోతుల్లో నీరు నిలబడి పోతోందని, దీంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు.

రాళ్లు తేలి... అధ్వానంగా మారి!



పాడైన ఆలమూరు-కొయ్యేటిపాడు మధ్య రహదారి

ఆలమూరు - కొయ్యేటిపాడు మధ్య పంచాయతీరాజ్‌కు చెందిన రహదారి పూర్తిగా పాడైంది. 2019లో ఈ మార్గాన్ని అభివృద్ధి పరిచారు. నాటి నుంచి కనీసం నిర్వహణ లేకపోవడంతో రాళ్లు తేలి గుంతలు పడ్డాయి. కొన్ని చోట్ల రహదారి పక్కనే ఉన్న రాపాక కాలువలోకి కోతకు గురవుతోంది. కొయ్యేటిపాడు వాసులు మండల కేంద్రంలో పనుల కోసం ఈ మార్గంలోనే ప్రయాణిస్తారు. వీధి దీపాలు లేని పరిస్థితిలో రహదారి అధ్వానంగా ఉండటంతో రాత్రి సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే స్థానికులు భయపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఏఈ ఏడుకొండలు మాట్లాడుతూ రహదారి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పెనుమంట్ర**

పట్టణ సుందరీకరణకు ప్రణాళిక



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ అభివృద్ధి, సుందరీకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలని సంయుక్త కలెక్టర్, పట్టణ ప్రత్యేకాధికారి రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టణంలో సమస్యలు, సదుపాయాలపై ఆరా తీశారు.

మహిళలకు ప్రభుత్వం అండ!

ఏటా మూడు సిలిండర్లు ఉచితంపై హర్షం

ఆచంట, మార్టేరు, పెనుగొండ, గ్రామీణ, న్యూస్‌టుడే

ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు దిశగా ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించనున్నట్లు సీఎం చంద్రబాబు ఇటీవల ప్రకటించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందనున్నడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ కుటుంబానికి ఏడాదికి ఆరు సిలిండర్ల వరకు అవసరమవుతాయని అంచనా. ఈ పథకంలో సగం ఉచితంగా ఇస్తుండటంతో వారిపై ఆర్థిక భారం తగ్గనుంది.



గ్యాస్ సిలిండర్లు

కొంత ఆర్థిక భారం తగ్గినట్లే



సిలిండర్ ఖర్చు సామాన్య కుటుంబాలకు భారమవుతోంది. ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నడంతో చిన్న కుటుంబాలకు ఈ పథకంతో కొంత ఆర్థిక భారం తగ్గినట్లే. ఎన్నికల సమయంలో చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీ నెరవేరుస్తుండటంతో సంతోషంగా ఉంది.

-బి.మంగతాయారు, వడలి

ఖర్చులు పెరిగిన తరుణంలో..



ఇచ్చిన హామీని మర్చిపోకుండా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేయడం అభినందనీయం. వివిధ రూపాల్లో ఇంటి ఖర్చులు బాగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల సరఫరా నిర్ణయం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడుతుంది.

-సి.వెంకటరమణ, సత్యవరం

మహిళలకు మేలు



ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేయడంతో మహిళలకు ఎంతో మేలు జరుగుతోంది. రుణ పరిమితి పెంచి స్వయం సహాయక మహిళలకు భరోసా ఇచ్చింది. తాజాగా ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలుపై ప్రకటన చేయడం హర్షదాయకం.

-టి.వాసవి, పాలమూరు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: సమస్య: రామారావుపేట సాయిబాబా ఆలయం వెనుక వీధిలో విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకున్నాయి. ఈ కారణంగా సరఫరా అంతరాయం కలుగుతోంది. **- రాము, రామారావుపేట.**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- బాబ్జీ, విద్యుత్తు శాఖ ఏఈ.

స్పందనకు వందనం

మురుగు కాలువ శుభ్రం.. **పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** లజపతిరాయ్‌పేటలో గత కొంతకాలంగా డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదని 'ఈనాడు' నిర్వహిస్తున్న 'మేమున్నాం మీకు తోడుగా...'కు చెప్పగా ఈనెల 3న కథనం ప్రచురితమైంది. దీనిపై పురపాలక పారిశుద్ధ్య అధికారి దావీదురాజు స్పందించి సిబ్బందితో మురుగు కాలువను శుభ్రం చేయించారు.

చెత్త తొలగింపు.. **పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే:** స్థానిక అచ్చుగట్లపాలెం పాత బ్యాంక్ కాలనీ నుంచి కొత్త కాలనీకి వెళ్లే మార్గంలో గత కొంతకాలంగా చెత్త శుభ్రం చేయడం లేదని 'ఈనాడు' నిర్వహిస్తున్న 'మేమున్నాం మీకు తోడుగా...'కు చెప్పగా ఈ నెల 4న ప్రచురితమైంది. దీనిపై పురపాలక పారిశుద్ధ్య అధికారి దావీదురాజు స్పందించి సిబ్బందితో చెత్తను తీయించి శుభ్రం చేయించారు.

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సిద్ధాంతం హైస్కూల్ సమీపంలో రహదారి చెంతన చెత్త వేస్తుండటంతో గాలికి ఎగిరి ఆ ప్రాంతం అంతా అపరిశుభ్రంగా మారుతోంది. దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఈ నెల 7న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

అంగరను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి

పాలకొల్లు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌ను పాలకొల్లులో బుధవారం రాత్రి కలిశారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని గోపీమూర్తి కోరారు. ఆయన వెంబడి పలువురు యూటీఎఫ్ నాయకులు ఉన్నారు.

గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవాలి

పెనుగొండ, పాలకొల్లు గ్రామీణ, నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ చట్టాల గురించి అవగాహన పెంచుకుని గ్రామాల్ని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి తెలిపారు. రెండో రోజు బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామాల నిర్వహణ, స్వచ్ఛతపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాలకొల్లులో ఈవోపీఆర్డీ మూర్తిబాబు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. నరసాపురం, మొగల్తూరు మండల పరిషత్తు కార్యాలయాల్లో నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిశాయి.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



గర్భిణికి చీర, పండ్లు అందజేస్తున్న పితాని

మార్టేరు, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. కొయ్యేటిపాడులో బుధవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణం, తాగునీటి పైపులైన్లు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. త్వరలోనే లో వోల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. తొలుత ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ తిలకించారు. అనంతరం సామూహిక సీమంతాల్లో భాగంగా గర్భిణులకు చీర, పండ్లు, పౌష్టికాహారం అందజేశారు. ✦ మార్టేరు మాజీ సర్పంచి కోనాల వీర రాఘవరెడ్డి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబీకులను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరామర్శించారు. ఈయన వెంట స్థానిక తెదేపా నాయకులు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



సర్వే చేస్తున్న సిబ్బంది

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: కొడమంచిలిలోని జగనన్న లేఅవుట్లలో వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాల బాగోతాలు ఒక్కొక్కటి బయటికొస్తున్నాయి. అధీకృత అధికారి సంతకం లేకుండా పట్టాలు జారీ చేసి లబ్ధిదారులను మోసం చేసిన నాయకులు ఏకంగా ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో తెదేపా నాయకుల పర్యవేక్షణలో బుధవారం వీఆర్వోలు, సర్వేయర్ టి.మెరక, పెదపేటలో భూసర్వే నిర్వహించారు. ప్రజావసరాలకు కేటాయించిన స్థలాన్ని ఒక నాయకుడు ఆక్రమించి నిర్మాణం చేపట్టారని నాయకులు తెలిపారు. కొన్ని ఖాళీ స్థలాల్లో అనధికారంగా నిర్మాణాలు చేసినట్లు గుర్తించామన్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి వైకాపా చేసిన మోసాలు బయటపెడతామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు.

జోరు వాన

మార్టేరు, పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఆచంట నియోజకవర్గంలోని గ్రామాల్లో బుధవారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం రెండు గంటలకు పెనుగొండ ప్రాంతంలో భారీ ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. మార్టేరు, సత్యవరం, కొయ్యేటిపాడు, ఆలమూరు ఆచంట, పోడూరు, సిద్ధాంతం, నడిపూడి గ్రామాల్లో ప్రాంతాల్లో జోరున వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. సిద్ధాంతం బస్టాండ్‌కి వెళ్లే దారిలో మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.



సిద్ధాంతంలో బస్టాండ్‌కు వెళ్లే దారిలో..

బాలిక అదృశ్యం

యలమంచిలి, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్యపేటకు చెందిన బాలిక ఈ నెల 8న అదృశ్యమైనట్లు యలమంచిలి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికులకు పరికరాలు అందించాలి



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న అంజయ్య

నరసాపురం, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలు, చేతి తొడుగులు వెంటనే అందించాలని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టారు. దీంట్లో భాగంగా బుధవారం 6వ వార్డులో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వార్డు కౌన్సిల్ పతివాడ మార్కండేయులు తదితరులు ఉన్నారు.

రూ.వందకు చేరువలో కూరగాయల ధరలు



నరసాపురం: రైతుబజారులో కూరగాయల దుకాణం

కూరగాయలు కిలో రూపాయల్లో (రైతు బజారులో / మార్కెట్‌లో)

కూరగాయ	రైతు బజారులో	మార్కెట్‌లో
దొండ	52	72
బీర	50	60
టమాట	70	80
పచ్చిమిర్చి	35	60
వంకాయ	60	80,90
క్యారెట్	60	80
బెండ	58	80
ఉల్లి	35,50	60

నరసాపురం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పలు రకాల ధరలు వందకు చేరువయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు తోటలు దెబ్బతినడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్లో చిక్కుడికాయలు దొరకడం లేదు. నిమ్మకాయలు సరిగా తయారవ్వనవి కిలో రూ.80, పండిన కాయలు రూ.100లకు విక్రయిస్తున్నారు. దీంతో కూరగాయలు కొనలేం.. తినలేం అనేలా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు.

పక్కనే తీసి.. అంచుల్లో వేశారు

నాణ్యత లేని పనులు



రహదారి సమీపంలోని ఇసుకతో అంచులు పూడ్చుతున్న యంత్రం

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులోని పాతకాలువ ప్రాంతం నుంచి పెదపల్లవపాలెం వరకూ చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా అంచుల పూడిక పనుల్లో నాణ్యత లోపించింది. సీతారామపురం, మల్లాడివారిదిబ్బ, కాళీపట్నం, మొగల్తూరులో ప్రస్తుతం అంతర్గతంగా ఉన్న జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ రహదారిని అభివృద్ధి చేసి ఆర్‌అండ్‌బీ శాఖకు బదలాయించాల్సి ఉంది. ఆయా రహదారులను రూ.10 కోట్లతో అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. మొగల్తూరు రహదారి అంచుల పూడిక పనుల్లో తీవ్రజాప్యం చోటుచేసుకుంది. నాలుగు నెలలుగా ఆ పనులు కొనసాగుతున్నాయి. అంచులు సక్రమంగా పూడిక చేయలేదు. పాతకాలువ ప్రాంతంలో రహదారి అంచుల్లో మెటల్ వేయకుండా సమీపంలోని ఇసుకతోనే పూడిక చేస్తున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ అధికారులను సమాచారం కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పేరుకుపోతున్న చెత్తకొండలు



రోజువారీ తరలింపునకు సమస్యలు

పాలకొల్లు పట్టణం, నరసాపురం, న్యూస్‌టుడే

పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో చెత్త కొండలా పేరుకొని దీర్ఘకాలిక సమస్యగా మారింది. రోజురోజుకీ చెత్త సమస్య జఠిలంగా మారుతోంది. పాలకొల్లు పురపాలక సంఘానికి చెందిన కంపోస్ట్‌యార్డుల నిర్వహణ స్థలాల్లో ప్రస్తుతం సుమారు 90 వేల టన్నుల చెత్త కొండలా పెరిగిపోయింది. రోజువారీ సేకరించిన చెత్తను వేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. సమీప నివాసితులు దుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నారు. ఈ చెత్త తరలించేందుకు పలుమార్లు అనేక ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. గతంలో చెత్తను విద్యుత్తు ఉత్పత్తికి వర్మీ కంపోస్ట్ ఉత్పత్తికి తరలించేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చినా ఆ తర్వాత పట్టించుకున్నవారేలేరు. చెత్త తొలగించడానికి పురపాలక సంఘం ప్రత్యేక దృష్టి పెట్టడం లేదని స్థానిక నివాసితులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో నిత్యం 42 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. దీన్ని రామయ్యహాలు ప్రాంతంలో స్థలంలోకి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ కూడా చెత్త కొండలా పెరిగిపోవడంతో చెత్తతో ట్రాక్టర్ వెళ్లడానికి కూడా కష్టంగా మారింది. పారిశుద్ధ్య కార్మికులు ట్రాక్టర్ల ద్వారా ఆ ప్రాంతాలకు చెత్త తరలించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. చెత్త సర్దుబాటు పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఫలితం ఉండటం లేదు. పురపాలక సంఘంలో వ్యర్థాలు డంపింగ్ చేయడానికి సరైన స్థలం లేక రామయ్యహాలు, సూర్యతేజనగర్ ప్రాంతాలకు వాహనాల్లో తరలించి కుమ్మరిస్తున్నారు. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిల్వ చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. దీనికితోడు పందులు, దోమలకు నిలయంగా మారి వర్షాకాలంలో మరింత దుర్గంధం వెదజల్లుతోంది. నరసాపురం పట్టణంలో రాయపేట, వైఎస్ కాలనీ, రుస్తుంబాద ప్రాంతాల్లో చెత్త సేకరణ కష్టంగా మారింది. సేకరించిన చెత్తను ఏటిగట్టుపై వేయడం వల్ల నీరు కలుషితం అవుతుంది.

మున్సిపాలిటి	పాలకొల్లు	నరసాపురం
వార్డులు	31	31
జనాభా	80వేలు	60వేలు
సేకరించే చెత్త	42 టన్నులు	24 టన్నులు
కార్మికులు	140	124
ఏటా ఖర్చు	రూ.6కోట్లు	6.4 కోట్లు
ట్రీట్మెంట్ ప్లాంట్లు	లేవు	ఉంది

✸ చెత్త సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తా. స్థల సేకరణ సమస్యగా మారింది. మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షణలో ఈ సమస్యను ఓ కొలిక్కి తీసుకురావడానికి ప్రయత్నిస్తాం.

- బి.విజయసారథి, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్.

✸ పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాం. డ్రెయిన్లు శుభ్రం చేస్తున్నాం. కాలనీల్లో శివారు ప్రాంతాల్లోని చెత్త కూడా డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నాం. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- ఎం.అంజయ్య, నరసాపురం మున్సిపల్ కమిషనర్.

సరస్వతీ నమస్తుభ్యం


పాలకొల్లు ఆధ్యాత్మికం, యలమంచిలి, పెనుగొండ, పెనుమంట్ర, నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు జరిగాయి. యలమంచిలిలో కనకదుర్గమ్మకు సరస్వతిదేవి అలంకరణ చేశారు. భాగవతుల నరసింహమూర్తి విద్యార్థులకు పెన్నులు, పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. పెనుగొండ క్షేత్రంలో అమ్మవార్లు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పెనుమంట్ర, చెరుకువాడలో పితాని సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మార్టేరు కామాక్షిదేవి ఆలయంలో విద్యార్థులు సరస్వతిపూజ చేశారు. పేరుపాలెంనార్తు రజకులపేటలో ఏర్పాటు చేసిన అమ్మవారికి మహిళలు కలశాలతో సముద్రజలాలు తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు.



క్షీరారామంలో సరస్వతీ దేవిగా..



పేరుపాలెంలో కలశపూజ చేస్తున్న మహిళలు



మార్టేరు కామాక్షిదేవి ఆలయం వద్ద సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు

లారీ ఢీకొని కార్మికుడి మృతి

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలో బుధవారం సాయంత్రం లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందారు. పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి కథనం ప్రకారం.. శ్రీహరిపేటకు చెందిన చందాని దుర్గాప్రసాద్(35) హోటల్‌లో కార్మికుడు. పనులు ముగించుకుని వెళ్తుండగా ఇంటికి సమీపంలో లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో దుర్గాప్రసాద్ ఘటనా ప్రాంతంలోనే మృతి చెందాడు. శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్గాప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

బాలిక ఆత్మహత్యాయత్నం

మొగల్తూరు, న్యూస్‌టుడే: అదృశ్యమైన బాలిక హైదరాబాదులో ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. ఆ బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 5న బాలిక అదృశ్యమైంది. బాలిక, ఆమెను వెంట తీసుకెళ్లిన యువకుడు హైదరాబాదులో విషపు గుళికలు తిని ఆత్మహత్యాయత్నం చేసినట్లు తెలిసింది. దీంతో ఆ బాలిక, యువకుడికి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. బాలిక పరిస్థితి విషమంగా ఉందని బంధువులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

నరసాపురం, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజేంద్ర బుధవారం తెలిపారు. భీమవరం గ్రామీణ మండలం వెంప గ్రామానికి చెందిన ముదునూరి తేజవీరవెంకటసత్యనారాయణరాజు ఈ నెల 2న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొత్తోటలో మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తేజ తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై ఆయన తండ్రి శ్రీరామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

నరసాపురం గ్రామీణ, పెనుమంట్ర, న్యూస్‌టుడే: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ ఇ.అనిల్ కుమారి అన్నారు. మల్లవరం, కొప్పర్రు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె ఆయా గ్రామాల్లోని రైతులకు పలు సూచనలు చేశారు. పెనుమంట్ర మండలం భట్లమగుటూరులో ఏవో ఎ.జ్యోషిలా మాట్లాడారు.

అవి ఇవి అన్నీ

బాధిత కుటుంబానికి సాయం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం పెద్దమామిడిపల్లిలో 3వ తేదీన జరిగిన విద్యుత్తు ప్రమాదంలో ఇల్లు దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న మెగా పవర్ అభిమానులు స్పందించి బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు, వంట సామగ్రి, దుస్తులు, రూ. ఐదు వేల నగదు బుధవారం అందించారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించాలి

ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే: దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. మండలంలోని కందరవల్లి పెదపేటలో సమస్యలపై బుధవారం స్థానికులతో మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

భాజపా సంబరాలు

పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే: హరియాణాలో మూడోసారి భాజపా ఘన విజయం సాధించడంపై భాజపా పట్టణశాఖ బుధవారం సంబరాలు నిర్వహించింది. స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో మిఠాయిలు పంపిణీ చేశారు.

ప్రజావసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి: డీపీవో



మాట్లాడుతున్న అరుణశ్రీ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామాలకు మంజూరయ్యే నిధులతో ప్రజావసరాలు తీర్చే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ అన్నారు. సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం డివిజన్ స్థాయిలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరాతోపాటు గ్రామాల్లోని ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. రక్షిత మంచినీటి పథకాల్లో నీటి శుద్ధికి లిక్విడ్ క్లోరినేషన్ పద్ధతి పాటించాలని కార్యదర్శులకు సూచించారు. ● జాతీయ ఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే పల్లె పండుగకు గ్రామాల్లో చేపట్టేందుకు పనుల జాబితా సిద్ధం చేయాలన్నారు. డీపీవో గ్రామాలవారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. డీఎల్పీవో ఐ.జ్యోతిర్మయి, డీఎల్పీవో కార్యాలయ పర్యవేక్షకులు యు.ఎస్.ఎస్ శ్రీనివాస్, డివిజన్‌లోని పది మండలాలకు చెందిన ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

డీఆర్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న హరికుమార్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పింఛనర్ల సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు బి.హరికుమార్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు కోరిన విధంగా 11వ పీఆర్సీని అమలు చేయాలన్నారు. డీఆర్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు



మండల అధికారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ వంశీ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలో ప్రజల నుంచి అందిన ప్రతి సమస్యను నిర్లక్ష్యం చేయకుండా మండల అధికారులు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ దశిక వంశీ సూచించారు. బుధవారం అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శామ్యూల్, ఎస్సై ప్రేమరాజు, ఈవోపీఆర్డీ శ్రీనివాసు తదితర మండల అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	: 79950 67078
పెంటపాడు	: 79939 36123
తణుకు గ్రామీణ	: 85558 50851
అత్తిలి	: 91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం శేష మహల్ సినిమా హాలు వెనుక రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది.
- రాఘవ, శేష మహల్ ప్రాంతం

సమాధానం: పరిశీలించి రహదారిలో చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం. **- శ్రీమన్నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: తాడేపల్లిగూడెం పట్టణం బ్రహ్మానంద రెడ్డి మార్కెట్ నుంచి సవిత్రుపేట కబేళాకు వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. **- రమణయ్య, సవిత్రుపేట**

సమాధానం: పరిశీలించి రహదారిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. **- ఏసుబాబు, పురపాలక కమిషనర్**

పెంటపాడు న్యూస్‌టుడే :

సమస్య : పెంటపాడు మండలం రాచర్లలోని జోడు స్తంభాల వీధిలోని కాలువ వ్యర్థాలతో పూడి పోవడంతో మురుగంతా రహదారిపైనే నిలిచిపోతోంది. పంచాయతీ వారికి చెప్పినా పట్టించుకోవడం లేదు. **- లక్ష్మి, రాచర్ల**

సమాధానం : కాలువలో పూడిక తొలగిస్తాం. **- బేగ్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య : పెంటపాడు కనకసుందరం కాలనీలో ప్రజా తాగునీటి కుళాయిలు రెండు మాత్రమే ఉండటంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అదనంగా రెండు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలి. **- రమేశ్, కనక సుందరం కాలనీ**

సమాధానం : సమస్య పరిశీలించి తాగునీటి కుళాయిల ఏర్పాటుకు కృషి చేస్తాం. **- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

కబ్జా కోరల్లో పుర చెరువులు



మురుగు కూపంలా మారిన పాతూరులోని మున్సిపల్ చెరువు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తాతల నాటి కాలంలో చెరువులకు ఎంతో ప్రాముఖ్యం ఉండేది. మంచినీటి, వ్యవసాయ, ఇతర అవసరాల కోసం చెరువులపైనే ఆధార పడేవారు. కాలక్రమేణా ప్రత్యామ్నాయాలు రావడంతో చెరువుల ప్రాధాన్యం తగ్గిపోయింది. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో మంచినీటిని తోడే చేతులతోనే చెత్తా చెదారాలను వేసి మురుగు కూపాలుగా మార్చారు. కొంత మంది మరో అడుగు ముందుకేసి చెరువులను సైతం ఆక్రమిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాడేపల్లిగూడెం పట్టణంలోని పలు చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.

పరిస్థితి ఇలా.. అధికారిక లెక్కల ప్రకారం పురపాలక సంఘం పరిధిలో 100.26 ఎకరాల విస్తీర్ణంలో 23 చెరువులు ఉన్నాయి. పురపాలక సంఘ రికార్డుల్లో మాత్రం కేవలం 15 చెరువులు మాత్రమే ఉండటం గమనార్హం. చాలా వరకు చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఆక్రమణ కారణంగా పలు చెరువుల విస్తీర్ణం తగ్గిపోయింది. పలు చోట్ల ఎకరాల్లో ఉండాల్సిన చెరువులు సెంట్ల లోకి వచ్చేశాయంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఉన్న ఆక్రమణలు తొలగించాలంటే చాలా కష్టమైన పని. ప్రారంభంలోనే అడ్డుకుని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఉండేది కాదు. ప్రధానంగా శివాలయం చెరువు, గొల్లగూడెం చెరువు, భట్టువానిగుంట చెరువు, ఎర్ర చెరువు, అనంతమ్మ చెరువు, పసర్ల చెరువు, సిద్ధి చెరువు, మంచినీళ్ల చెరువు, కొత్త క్రర చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్ని చెరువుల్లో మురుగు నీటి గొట్టాలను ఏర్పాటు చేయడంతో అవి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి.



స్థానిక గొల్లగూడెంలోని మున్సిపల్ చెరువు వద్ద ఏసీ రైతుబజారు ఏర్పాటు చేయడం కోసం మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కేంద్రం ద్వారా నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు మురుగు కూపంలా ఉన్న చెరువును పురపాలక సంఘం ద్వారా పూడ్చించారు. కొన్ని కారణాల వల్ల రైతు బజారు నిర్మాణం ఆగిపోయింది. మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ఏళ్లతరబడి ఈ చెరువును పట్టించుకోకపోవడంతో కబ్జా కోరల్లో కొట్టుమిట్టాడుతోంది. చాలా మంది చెరువు గట్లను ఆక్రమించుకుని నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు.

చెరువుల పరిరక్షణకు కృషి చేస్తాం

పట్టణంలోని చెరువుల అభివృద్ధికి కృషి చేస్తాం. ఆక్రమణలకు గురైన చెరువులను గుర్తించి ప్రక్షాళన చేస్తాం.
- ఏసుబాబు, మున్సిపల్ కమిషనర్

యోగా పోటీల్లో చంద్రశేఖర్‌కు బంగారు పతకం



అభినందిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

దండగర్ర(తాడేపల్లిగూడెం వన్‌టౌన్),న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్ కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. దీంతోపాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను కలవగా చంద్రశేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న భవానీ శంకరి

రైతులను ఇబ్బంది పెట్టొద్దు: ఆర్డీవో

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఈ క్రాప్ నమోదుకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలని ఆర్డీవో భవానీ శంకరి పేర్కొన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న ఏడీఏ మురళీ కృష్ణ

పెంటపాడు, న్యూస్‌టుడే : రైతు సహాయక కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తాడేపల్లిగూడెం డివిజన్ ఏడీఏ పి. మురళీకృష్ణ రైతులకు సూచించారు. ఖరీఫ్ సాగుకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు మందిరంలో తహసీల్దార్ కె.శ్రీనివాస్ అధ్యక్షతన శిక్షణ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ రైతు సహాయక కేంద్రాల వద్ద రైతు తమ ధాన్యాన్ని విక్రయించి కనీస మద్దతు ధర పొందాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు తమకు నచ్చిన మిల్లుకి ధాన్యాన్ని తరలించే అవకాశం కల్పించిందన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏవో పార్థ సారథి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ వై.రవికుమార్, రైతు సేవా కేంద్రం అధికారులు, వీఆర్వోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కాలువ శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి బస్టాండు కూడలి వద్ద కొన్ని రోజులుగా ప్లాస్టిక్ వ్యర్థాలు, పశువుల కళేబరాలు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బుధవారం 'ఈనాడు'లో 'కాలువ కలుషితంతో దుర్గంధం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో కాలువలో నిలిచి పోయిన చెత్తాచెదారం కళేబరాలను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



తణుకు గ్రామీణం న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ సభ్యులు మల్లిన అరుణ సారథి పుట్టిన రోజు పురస్కరించుకుని వారి ఆర్థిక సహాయంతో పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వేమగిరి వారి ఆధ్వర్యంలో స్థానిక రోటరీ క్లబ్ వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యనిపుణులు డా కరీమ్ షేక్ శిబిరం ద్వారా 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 15 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వేమగిరి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో కార్యదర్శి కె సిద్ధార్థ, ప్రాజెక్టు మేనేజర్ చండికాలు, సభ్యులు విశ్వనాథ, సుబ్రహ్మణ్యం, వెంకట్రావు, రెడ్డి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు గ్రామీణం న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తూర్పు విప్పర్రు గ్రామ సర్పంచి తమ్మిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు సచివాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 72 మందికి పరీక్షలు చేసి వైద్య సలహాలు అందించారు. 8 మందికి శస్త్ర చికిత్సల నిమిత్తం ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి సిఫార్సు చేశారు. 22 మందికి రాయితీ కళ్లద్దాలు అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం

తణుకు గ్రామీణం న్యూస్‌టుడే: తపాలా శాఖ ద్వారా అందించే సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ ఎం.సూర్యప్రకాష్, హెడ్ పోస్ట్ మాస్టర్ సీహెచ్ వెంకట సుబ్బారావు కోరారు. ప్రపంచ తపాలా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పోస్ట్ ఆఫీస్ ద్వారా అందించే వివిధ సేవలను ప్రజలకు వివరించి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఏ రామకృష్ణ, భాస్కర రాజు, చైతన్య, శ్రీనివాస్, గణేశ్‌కుమార్, మూర్తి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న పోస్టల్ సిబ్బంది



ముద్దాపురం రోడ్డులో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



దువ్వలో రూ.33 లక్షలతో అలంకరించిన కనకదుర్గ



తాడేపల్లిగూడెం బలుసులమ్మ



ముత్యాలంపాడులో ముత్యాలమ్మ

సరస్వతీ నమస్తుభ్యం

దేవీ శరన్నవ రాత్రులను పురస్కరించుకుని తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మ వార్లు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో వద్ద పెద్దసంఖ్యలో విద్యార్థులు సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. వీరంపాలెంలోని మేధా సరస్వతి అమ్మవారి ప్రాంగణంలో భక్తులు దర్శనానికి పోటెత్తారు. పెంటపాడులోని సరస్వతి ఆలయంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. అత్తిలి చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించి సరస్వతీ దేవిగా అలంకరించారు. మండపాక యల్లారమ్మ ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించి సరస్వతి యజ్ఞం నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం



అత్తిలి: సరస్వతిగా చాముండేశ్వరి



ఆరుగొలనులోని విజయదుర్గ



వీరంపాలెంలోని మేధా సరస్వతి



గూడెం: సర్వమంగళ అమ్మవారు



తాడేపల్లిగూడెం: భాగ్యలక్ష్మి పేటలో

భాజపా విజయోత్సవాలు




నినాదాలు చేస్తున్న భాజపా నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: హరియాణా రాష్ట్రంలో భాజపా విజయం సాధించిన నేపథ్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో విజయోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ డిపో వరకు ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు కర్రి ప్రభాకర బాలాజీ, కోట రాంబాబు, ఐనం బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకపై జీఎస్టీ రద్దు చేయాలని నిరసన

తాడేపల్లిగూడెం వన్‌టౌన్,న్యూస్‌టుడే: ఉచిత ఇసుకపై జీఎస్టీ రద్దు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికుల (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) సంఘం ఆధ్వర్యంలో ఎల్.అగ్రహారంలో బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం మంచిదే అయినా క్షేత్ర స్థాయిలో విఫలమవుతోందన్నారు. అక్రమార్కులు అక్రమ సిండికేట్ బుక్ చేసుకుని మార్కెట్లో కృత్రిమ కొరత తీసుకు వస్తున్నారని ఆరోపించారు. గృహ యజమానులకు మాత్రమే ప్రత్యేకంగా బుక్ చేసుకునే విధానం అమలు చేయాలని తెలియజేశారు. వెంటనే పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ఇసుక ర్యాంపులు ప్రారంభించడానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.అగ్రహారం అధ్యక్షుడు దయ్యం పాండురంగారావు, రంగసాయి బసిరెడ్డి, సురేశ్, జగన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు చే గువేరా ఆదర్శం



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

తణుకు గ్రామీణం న్యూస్‌టుడే: పేదరికం, దోపిడీ, అసమానతలు లేని సమాజం కోసం జీవితాన్ని ధారబోసిన చే గువేరా ఆశయ సాధనకు యువత పూనుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. చే గువేరా వర్ధంతి సందర్భంగా బుధవారం వంకా సత్యనారాయణ సురాజ్య భవనం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గార ప్రసాద్, జి.వెంకటేశ్వరరావు, బి.సత్యనారాయణ, రాధాకృష్ణ జార్జి తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళులు

తణుకు గ్రామీణం న్యూస్‌టుడే: నీలి జెండాను రెపరెపలాడించిన రాజకీయ యోధుడు కాన్షీరాం అని ఆల్ ఇండియా పులే అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు పొట్ల సురేశ్ కొనియాడారు. కాన్షీరాం వర్ధంతి సందర్భంగా బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. నాయకులు రాజశేఖర్, నాగబాబు, గాంధీ, రవి తదితరులు పాల్గొన్నారు.

గోవులకు దాణా

తాడేపల్లిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రహదారులపై సంచరిస్తున్న ఆవులకు ఉంగుటూరు మండలం ఉప్పాకపాడుకు చెందిన ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం దాణా పెట్టి ఔదార్యం చాటుకున్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ గోమాత సుభిక్షంగా ఉంటేనే దేశం బాగుంటుందన్నారు. ఆవులకు మేత దొరక్క పోస్టర్లు, ప్లాస్టిక్ సంచులు తిని అనారోగ్యం బారినపడటం చూడలేక దాణా పెట్టామని చెప్పారు.

గల్లంతైన భవానీ భక్తుడి మృతదేహం లభ్యం



దుర్గా ప్రసాద్ (పాతచిత్రం)

తణుకు గ్రామీణం న్యూస్‌టుడే: కాలువలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు గల్లంతైన భవాని భక్తుడు మృతదేహం బుధవారం ఉదయం పైడిపర్రు సమీపంలో లభ్యమైంది. తేతలి గ్రామానికి చెందిన కాజా దుర్గా ప్రసాద్(23) ఇటీవల భవానీ మాల ధరించాడు. మంగళవారం రాత్రి తేతలి వద్ద అత్తిలి కాలువలో స్నానానికి దిగారు. నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో గమనించక నీటిలో కొట్టుకుపోయాడు. గాలింపు చర్యలు చేపట్టిన పోలీసు, ఫైర్ సిబ్బంది మృతదేహాన్ని పైడిపర్రు సమీపంలో గుర్తించారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. స్థానికంగా తల్లిదండ్రుల వద్ద ఉంటూ కూలి పని చేసుకుంటున్న దుర్గా ప్రసాద్ కొద్ది నెలల కిందట అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. • దుర్గారావు కుటుంబ సభ్యులను తేతలిలో బుధవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు తెదేపా నాయకులు, తహసీల్దార్ అశోక్ వర్మ పరామర్శించారు. తక్షణ సహాయం కింద ఎమ్మెల్యే రాధాకృష్ణ రూ.10 వేలు, చుంచు వెంకటేశ్వరరావు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పాలనపై అవగాహన తప్పనిసరి

తాలూకాఫీసుకూడలి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ పాలనపై ప్రతి గ్రామ వార్డు సభ్యులకు అవగాహన ఉన్నప్పుడే ప్రజలకు తాము ఏమి చేయగలమో తెలుస్తుందని ఎంపీడీవో విశ్వనాథ్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశం మందిరంలో బుధవారం గ్రామ ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారు చేపట్టాల్సిన విధులు, ప్రజలకు పంచాయతీరాజ్ చట్టం ద్వారా చేసే కార్యక్రమాలను వివరించారు. శిక్షణ కార్యక్రమం ముగియడంతో ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం.వెంకటేశ్, ఏవో సుజాత, మాస్టర్ ట్రైనర్ టి.రవిచంద్ర ఉప సర్పంచులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వార్డు సభ్యులు

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం..

తణుకు గ్రామీణం న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దేందుకు పాటుపడుతున్నాయని దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కృషి చేయాలని తణుకు ఎంపీడీవో లోహిత్ జయసాగర్ కోరారు. తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉప సర్పంచులు, వార్డు సభ్యులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం తణుకు ఎంపీడీవో జయసాగర్ పాల్గొని మాట్లాడారు

కుళ్లిన ఉల్లి మూటలతో దుర్గంధం



అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలం మంచిలి గ్రామంలో డంపింగ్ యార్డు వద్ద ప్రధాన రహదారిపైనే కుళ్లిన ఉల్లి మూటలు వేయడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ఎదురుగా నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారిపై చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి తెలిపారు.